సాక్షి సిద్దిపేట
శుక్రవారం । 16 । ఆగస్టు । 2024



విద్యార్థిని కోయ డ్యాన్స్



డిగ్రీ కళాశాల మైదానంలో కొండపాక విద్యార్థుల నృత్య ప్రదర్శన

తిరంగా.. ఘనంగా

- అట్టహాసంగా పంద్రాగస్టు సంబరాలు
- అలరించిన విద్యార్థుల ప్రదర్శనలు
- స్వాతంత్ర్య సమర యోధులకు సన్మానాలు

సిద్దిపేటజోన్: స్వాతంత్ర్య వేడుకలు జిల్లా వ్యాప్తంగా అంబరాన్నంటాయి. గురువారం జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించిన పతాకావిష్కరణ కార్యక్రమం వైభవంగా జరిగింది. మూడున్నర గంటల పాటు వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. గౌరవ వందనం స్వీకరించారు. జిల్లా ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. అనంతరం వివిధ ప్రాంతాలకు చెందిన పది మంది స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాలను కలెక్టర్ మనుచౌదరి, పోలీస్ కమిషనర్ అనురాధతో కలిసి సన్మానించారు. మంత్రి ప్రసంగం సమయంలో ఒక కాంగ్రెస్ వీరాభిమాని పరేడ్ గ్రౌండ్‌లో కాంగ్రెస్ జెండా చేతబట్టి సైకిల్ మీద చక్కర్లు కొట్టడం పలువురిని ఆకర్షించింది.

సాంస్కృతిక కార్యక్రమాలు అదుర్స్...

ఈ సందర్భంగా వివిధ పాఠశాలల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రశాంత్‌నగర్ జెడ్పీ పాఠశాల విద్యార్థుల కోయ నృత్యం, నారాయణరావుపేట విద్యార్థుల పిరమిడ్, కొండపాక జెడ్పీ విద్యార్థుల దేశభక్తితో కూడిన ప్రదర్శన, ఎన్సాన్‌పల్లి జెడ్పీ విద్యార్థుల కోలాటం కనువిందు చేశాయి. ఈ సందర్భంగా మంత్రి, కలెక్టర్, పోలీస్ కమిషనర్‌లు విద్యార్థులను అభినందించారు. వారితో కలిసి ఫొటోలు దిగారు.



విద్యార్థినుల నృత్య ప్రదర్శన

న్యూస్‌రీల్

రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు కృషి

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక: ప్రజల చిరకాల కోరికైన దుబ్బాక రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు కృషిచేస్తానని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. గురువారం దుబ్బాకలో స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. దశాబ్దాలుగా రెవెన్యూ డివిజన్ కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ అమలుకు కృషి చేస్తానన్నారు. రెండు పర్యాయాలు ఎంపీగా, ఇప్పుడు ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజలకు రుణపడి ఉంటానన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంతో కొట్లాడి నియోజకవర్గం అభివృద్ధికి నిధులు రాబడతానని హామీ ఇచ్చారు. అనంతరం తన క్యాంపు కార్యాలయంలో వంద మంది బాధిత కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత తదితరులు ఉన్నారు.

పట్టు రైతుకు అరుదైన గౌరవం



స్టాల్‌లో ప్రదర్శించిన రైతు సక్సెస్ స్టోరీ

ప్రశాంత్‌నగర్ (సిద్దిపేట): జిల్లాకు చెందిన పట్టు రైతుకు అరుదైన గౌరవం లభించింది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గురువారం ఖమ్మం జిల్లా వైరాలో నిర్వహించిన రాష్ట్రస్థాయి వేడుకల్లో రాష్ట్ర పట్టు పరిశ్రమ శాఖ ఏర్పాటు చేసిన స్టాల్‌లో నంగునూరు మండలం ముండ్రాయికి చెందిన పట్టు రైతు రాగుల రాజు సక్సెస్ స్టోరీని ప్రదర్శించారు. 2023-24లో అధిక దిగుబడి సాధించి రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో నిలిచారు. ఉత్తమ పట్టు రైతుగా ప్రభుత్వం గుర్తించి తన సక్సెస్ స్టోరీని రాష్ట్రస్థాయి వేడుకల్లో ప్రదర్శించడం సంతోషంగా ఉందని రాజు ఆనందం వ్యక్తం చేశారు.

దొడ్డి కొమురయ్య స్ఫూర్తిని చాటాలి



దొడ్డి కొమురయ్య విగ్రహావిష్కరణ కార్యక్రమంలో నాయకులు, గ్రామస్తులు

వర్గల్(గజ్వేల్): తెలంగాణ తొలి రైతాంగ పోరాట అమరుడు దొడ్డి కొమురయ్య స్ఫూర్తితో కురుమలు అన్ని రంగాల్లో పురోగతి సాధించాలని కురుమ రిజర్వేషన్ పోరాట సమితి (కేఆర్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు బింగి స్వామి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు బాలమల్లుయాదవ్ అన్నారు. గురువారం వర్గల్ మండలం శేరిపల్లిలో దొడ్డి కొమురయ్య విగ్రహావిష్కరణ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వతంత్ర్య దినోత్సవం రోజు కొమురయ్య విగ్రహం ఆవిష్కరించుకోవడం కురుమల ఐక్యతను చాటుతుందన్నారు. కురుమలు బాగా చదువుకుని ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో పురోగతి సాధించాలన్నారు. కార్యక్రమంలో కురుమ సంఘం నాయకులు బాషయ్య, ఐలయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

'గౌరవెల్లి'ని పూర్తిచేసి నీరివ్వండి

హుస్నాబాద్: గౌరవెల్లి ప్రాజెక్టును త్వరగా పూర్తి చేసి పంట కాలువలకు నీరు విడుదల చేయాలని మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్ డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రాజెక్టు పనులు 98 శాతం పూర్తి చేశామన్నారు. మిగిలిన పనులు సకాలంలో పూర్తి చేసి రైతులకు సాగునీటిని అందించాలన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా స్థానిక బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జాతీయ జెండాను ఎగురవేసి మాట్లాడారు. నియోజకవర్గంలో సాగు, తాగునీటికి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్ పర్సన్ అయిలేని అనిత, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన పారదర్శకం

అందరికీ సంక్షేమ ఫలాలు

- ఇప్పటి వరకు 2.23కోట్ల మంది మహిళల ఉచిత ప్రయాణం
- 1.65లక్షల మందికి రూ.500లకే గ్యాస్ సిలిండర్ ఇచ్చాం
- 1.89లక్షల మందికి ఉచిత విద్యుత్
- రెండు విడతల్లో 81వేల మంది రైతులకు రూ.567కోట్ల రుణమాఫీ
- 'మహిళా శక్తి'లో రూ.165 కోట్ల ప్రణాళికలు
- స్వాతంత్ర్య వేడుకల్లో మంత్రి పొన్నం ప్రభాకర్
- జాతీయ జెండాను ఆవిష్కరించిన మంత్రి



మాట్లాడుతున్న మంత్రి పొన్నం

సాక్షి, సిద్దిపేట: కొత్త ప్రభుత్వంలో ప్రజాపాలన, పారదర్శకం, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు దక్కాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం జాతీయ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేస్తున్నారన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం అమలు చేస్తున్నామన్నారు. ఇప్పటివరకు జిల్లాలో 2.23కోట్ల మంది మహిళలు ఉచిత బస్సును వినియోగించుకున్నారన్నారు. ఇందుకు వారికి రూ.82కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. మహాలక్ష్మి పథకం కింద రూ.500లకే వంట గ్యాస్‌ను అందిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు 1,65,912 మంది వినియోగదారులు 3,23,012 గ్యాస్ సిలిండర్లు వినియోగించుకున్నారని, ప్రభుత్వం రూ.9,84,09,000 సబ్సిడీ అందించిందన్నారు. గృహజ్యోతి కింద 1,89,806 మంది వినియోగదారులకు ఉచిత విద్యుత్‌ను వినియోగించుకోగా రూ28కోట్లను ప్రభుత్వం చెల్లించిందన్నారు.

81వేల మందికి రుణ మాఫీ

ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా రూ.2లక్షల రైతు రుణ మాఫీ మూడు విడతల్లో చేశామన్నారు. రెండు విడతల్లో 81,004 మంది రైతులకు రూ.567 కోట్ల రుణ మాఫీ చేశామన్నారు. రైతు నేస్తం ద్వారా వివిధ పంటల సాగు పై అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి సందేహాలను నివృత్తి చేశామన్నారు. ఈ సీజన్‌కు సరిపడా ఎరువులను అందుబాటులో ఉన్నాయన్నారు. జిల్లాలో 11,100 ఎకరాల్లో ఆయిల్ పాం సాగు అవుతుండగా ఈఏడాది మరో 4వేల ఎకరాలు లక్ష్యంగా నిర్ణయించామన్నారు.

మహిళా శక్తిలో ..

మహిళా శక్తిలో భాగంగా 2024-25లో రూ.165 కోట్లతో 18,788 మందికి జీవనోపాధి కల్పించేందుకు ప్రణాళికలను రూపొందించామన్నారు. మహిళలను కోటీశ్వరులను చేసే కార్యక్రమంలో భాగంగా 15,534 సంఘాలకు రూ.895కోట్ల రుణాలు లక్ష్యంగా నిర్ణయించుకుని ముందుకు సాగుతున్నామన్నారు.



జాతీయ జెండాను ఆవిష్కరించి వందనం చేస్తున్న మంత్రి పొన్నం, కలెక్టర్ మనుచౌదరి, సీపీ అనురాధ తదితరులు

వనమహోత్సవంలో 20లక్షల మొక్కలు

వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా 22లక్షల మొక్కలను నాటేందుకు లక్ష్యంగా నిర్ణయించామన్నారు. వివిధ శాఖల సమన్వయంతో ఇప్పటి వరకు 20లక్షల మొక్కలు నాటినట్లు తెలిపారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం కింద ఐదు రోజుల పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించామన్నారు. 2024-25 గ్రామ పంచాయతీలకు రూ.12కోట్లు మంజూరు చేశామన్నారు.

రూ.431 కోట్లు మంజూరు

హుస్నాబాద్, స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గాల్లో 1,06,000 ఎకరాలకు సాగు నీటిని అందించేందుకు లక్ష్యంగా 2007లో గండిపెల్లి గౌరవెల్లి రిజర్వాయర్‌కు శంకుస్థాపన చేశామని తెలిపారు. రిజర్వాయర్‌ను స్థిరీకరించేందుకు ఎస్సారెస్పీ ప్యాకేజీ 7లో మిగిలిన పనులను పూర్తి చేసేందుకు రూ.431.30కోట్లను మంజూరు చేసిందన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు

జిల్లాలో 980 ప్రభుత్వ పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను ఏర్పాటు చేశాం. క్షేత్రస్థాయిలో అవసరాల మేరకు 840 పాఠశాలల్లో రూ.42కోట్లతో అత్యవసరమైన పనులను చేపట్టినట్లు తెలిపారు. 238 ప్రభుత్వ పాఠశాలలలో పదో తరగతి విద్యార్థులు 100శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. 229 మంది ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారని తెలిపారు. జిల్లాకు చెందిన నలుగురు విద్యార్థులకు అంబేద్కర్ ఓవర్‌సిస్ విద్యానిధి కింద రూ 5.2కోట్లను అందించామన్నారు.

పట్టణాలు అభివృద్ధి

టీయూఎఫ్ఐడీసీ నుంచి హుస్నాబాద్ మున్సిపాలిటీకి రూ.26కోట్లను, కూడళ్ల అభివృద్ధి కోసం రూ.2కోట్లను మంజూరు చేశామని తెలిపారు. గజ్వేల్ మున్సిపాలిటీకి రూ.1.25కోట్ల, దుబ్బాక మున్సిపాలిటీకి రూ.10కోట్లు, చేర్యాలకు రూ.15కోట్లను మంజూరు చేసినట్లు వివరించారు.

డ్రగ్స్ పై ప్రత్యేక నిఘా

జిల్లాలో గంజాయి, డ్రగ్స్, కొకైన్ లాంటి మత్తు పదార్థాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మాదకద్రవ్య రహిత జిల్లాగా ఏర్పాటు చేయడానికి కృషి చేస్తున్నామన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ, అసాంఘిక కార్యక్రమాలను నిర్మూలిస్తూ, ఫ్రెండ్లీ పోలీసు విధానాన్ని సమర్థంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా అభివృద్ధిలో భాగస్వాములవుతున్న ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు.



ఉత్తమ సేవలకు ప్రశంసలు

239 మందికి అవార్డులు

సిద్దిపేటజోన్: జిల్లాలో ఉత్తమ సేవలు అందించిన 239 మంది అధికారులకు, సిబ్బందికి పంద్రాగస్టును పురస్కరించుకుని మంత్రి పొన్నం ప్రశంసా పత్రాలు అందించి అభినందించారు. అలాగే పలువురు పోలీసు అధికారులకు సేవ పతకాలతో అందించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు ముందస్తుగా మంత్రి పొన్నంకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

ఆకట్టుకున్న శకటాలు, స్టాల్స్

వేడుకల సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖల శకటాలు ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి. మహిళల ఆర్టీసీ ఉచిత ప్రయాణం పథకం వివరించేలా మహిళలతో కూడిన ఆర్టీసీ బస్సు ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అదేవిధంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో అమ్మ ఆదర్శ పాఠశాల శకటం, సివిల్ సప్లై ఆధ్వర్యంలో మహాలక్ష్మి గ్యాస్ పథకం, విద్యుత్ శాఖ వారి ఉచిత విద్యుత్, గృహజ్యోతి శకటం, వ్యవసాయ శాఖ రైతు వేదిక, రైతు నేస్తం, పంచాయతీ రాజ్, అటవీశాఖ, గ్రామీణాభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో శకటాల ప్రదర్శన నిర్వహించారు. అనంతరం స్టీల్ బ్యాంక్, సెట్విన్, వైద్యశాఖ, గ్రామీణాభివృద్ధి, సఖి, మున్సిపల్ మెప్మా, చేనేత జౌళి శాఖ, పట్టు, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను మంత్రి పొన్నం, కలెక్టర్, పోలీసు కమిషనర్‌తో కలిసి తిలకించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు గరిమ అగర్వాల్, శ్రీనివాస్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి, సిద్దిపేట నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి హరికృష్ణ, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అత్తు, నాయకులు పాల్గొన్నారు.



స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబసభ్యులను సన్మానిస్తున్న మంత్రి, కలెక్టర్, సీపీ



పోలీసుల పరేడ్



మహాలక్ష్మి పథకంపై శకట ప్రదర్శన

మూడో విడత రూ.271.21 కోట్లు

- 21,071 మంది రైతులకు రుణ మాఫీ
- మొత్తం రూ.840.78కోట్లు విడుదల
- కర్షకుల్లో హర్షాతిరేకాలు



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రుణమాఫీలో మూడో విడతగా నిధులు విడుదలయ్యాయి. రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. రూ.2లక్షల రుణ మాఫీలో భాగంగా గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఖమ్మం జిల్లా వైరాలో మూడో విడత మాఫీకి సంబంధించిన నిధులు విడుదల చేశారు.12 డిసెంబర్ 2018 నుంచి 13 డిసెంబర్ 2023 వరకు రూ.2లక్షల వరకు రుణాలను ఆగస్టు15 లోగా మాఫీ చేస్తామన్న హామీని సీఎం రేవంత్ నిలబెట్టుకున్నారు.

జిల్లాలో రూ.2లక్షల వరకు రుణం తీసుకున్న రైతులు 2.09లక్షలమంది ఉన్నారు. వీరికి రూ.2,026 కోట్ల రుణాలు ఉన్నాయి. ఈ మొత్తం విడతల వారీగా మాఫీ అవుతున్నాయి. ఇందులో భాగంగా మూడో విడతలో రూ.2లక్షల వరకు రుణం తీసుకున్న 21,071 మంది రైతులకు రూ.271, 21,07,934 నేరుగా నిధులు చేశారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా బ్యాంకులకు సెలవు ఉండటంతో ఖాతాల్లో జమకాలేదు. శుక్రవారం ఖాతాల్లో జమ కానున్నాయి. ఇప్పటికే జిల్లాలో రూ.లక్ష వరకు రుణాలు తీసుకున్న 53,137 మంది రైతుల ఖాతాల్లో రూ.290,24,28,954 గత నెల 18న జమ అయ్యాయి. అదేవిధంగా రూ.1.50లక్షల వరకు రుణాలు తీసుకున్న 27,955 మంది రైతులకు గత నెల 29న రూ.279,33,31,968 జమ చేశారు. ఈ మూడు విడతల్లో కలిపి 1,02,163 మంది రైతులకు రూ. 840,78,68,856 మాఫీ అయ్యాయి. మిగిలిన 1,06,837 మందికి రూ.1185,21,31,144 మాఫీ కావాల్సి ఉంది. బ్యాంక్ ఖాతాలు, పేర్లలో మార్పులు, పాస్‌బుక్‌లో తప్పులు, తదితర కారణాలతో రుణమాఫీ కాలేదు. బాధిత రైతులు ఇప్పటికే అధికారులకు తమ వినతులను అందించారు. తప్పులు సరిచేసి రుణాలు మాఫీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

రైతుల్లో సంతోషం..

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు విడతల వారీగా రుణాలు మాఫీ కావడంతో రైతుల్లో ఆనందం వెల్లివిరిస్తోంది. తమకున్న రుణాలు మాఫీ కావడంతో తమ బాధలు తీరుతున్నాయని రైతులు చెబుతున్నారు. మళ్లీ బ్యాంక్‌లో కొత్త రుణాలు తీసుకునే వెసులుబాటు కల్గుతుందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా తమ రుణాలు తీర్చే వెసులుబాటు లేకపోవడంతో, రాష్ట్ర ప్రభుత్వమే తమ రుణాలను తీరుస్తుండటంతో రైతులు సంబరపడిపోతున్నారు.



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

సమాజాభివృద్ధికి కృషి చేద్దాం

- అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్
- కలెక్టరేట్‌లో జాతీయ పతాకం ఆవిష్కరణ

సిద్దిపేటరూరల్: స్వతంత్ర్య పోరాటంలో ఎంతో మంది త్యాగధనులు అమరులయ్యారని వారిని గుర్తు చేసుకుంటూ సమాజాభివృద్ధికి ముందుకు సాగాలని అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో గరిమా అగర్వాల్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అంతకు ముందు పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ త్యాగాలను గుర్తు చేసుకుంటూ వారి మార్గంలో నడుస్తూ సమాజ అభివృద్ధికి అందరు కృషిచేయాలన్నారు. ఈ జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి నాగరాజమ్మ, వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అంగన్‌వాడీలో చోరీ

కొండపాక(గజ్వేల్): కొండపాక మండలం మర్పడ్గలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. రోజులాగే అంగన్‌వాడీ టీచర్ బుధవారం సాయంత్రం కూడా కేంద్రానికి తాళం వేసి వెళ్లింది. గుర్తు తెలియని వ్యక్తి తాళాలు పగులగొట్టి గ్యాస సిలిండర్‌ను ఎత్తుకెళ్లాడు. ఈ విషయమై టీచరు త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

రేషన్ బియ్యం స్వాధీనం


పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తున్న 50 క్వింటాళ్ల పీడీఎస్ రైస్ (రేషన్ బియ్యం)ను జగదేవ్‌పూర్ పోలీసులు పట్టుకున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలం పుట్టగూడెంకు చెందిన మాలోతు శ్రీకాంత్ జగదేవ్‌పూర్ మండలం దౌలాపూర్ శివారులో అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నాడనే సమాచారం మేరకు పోలీసులకు అందింది. దీంతో గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి, జగదేవ్‌పూర్ ఎస్‌ఐ చంద్రమోహన్‌లు గురువారం తమ సిబ్బందితో కలిసి వెళ్లి దాడులు చేశారు. ఇందులో 50 క్వింటాళ్ల రేషన్ బియ్యంతో పాటు ఆటోను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపారు. ఎవరైనా ప్రభుత్వ అనుమతులు లేకుండా రేషన్ బియ్యం తరలించినా, నిల్వ చేసినా, విక్రయించినా చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ఏఎస్‌ఐ రమణారెడ్డి, హెడ్ కానిస్టేబుల్ తాజుద్దీన్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మిషన్‌లో ఇరుక్కుపోయి ఆపరేటర్ దుర్మరణం

పటాన్‌చెరు టౌన్: పనిచేసే చోట మిషన్‌లో ఇరుక్కుపోయి ఓ కార్మికుడు మృతిచెందాడు. ఈ సంఘటన సంగారెడ్డి జిల్లా బీడీఎల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. బిహార్‌కు చెందిన వాజేంద్ర కుమార్ (29) బతుకుదెరువు కోసం 2015లో పటాన్‌చెరు మండలం పాశమైలారానికి వచ్చి పారిశ్రామికవాడలోని టైబి డై కాస్ట్ కంపెనీలో మిషన్ ఆపరేటర్‌గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఈనెల 14న రాత్రి మిషన్ వద్ద పనిచేస్తుండగా మిషన్‌లో నుంచి అల్యూమినియం మెటీరియల్ తయారు చేసి బయటకు తీసే క్రమంలో మిషన్ డై మధ్యలో ఇరుక్కుపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. పరిశ్రమ యజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే తన సోదరుడు మృతి చెందాడని వజేంద్ర సోదరుడు భగత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఎదురుగా వస్తున్న కారును ఢీకొట్టి..

– బైకిస్టు మృతి

హత్నూర(సంగారెడ్డి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన హత్నూరు మండలం నస్తీపూర్ గ్రామ శివారులో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం మండలంలోని సాదుల్‌నగర్‌కు చెందిన ఆందూరి వెంకటేశం (49) బుధవారం రాత్రి తెలిసిన వారి బైక్‌ను తీసుకొని కిరాణా సామాను కోసం దౌల్తాబాద్‌కు వెళ్లాడు. తిరిగొస్తుండగా నస్తీపూర్ గ్రామశివారులో గల సువర్ణ దుర్గ పేపర్ మిల్ కంపెనీ వద్ద రాగానే బైక్‌ను అతివేగంగా నడిపి కుడివైపునకు వెళ్లి ఎదురుగా వస్తున్న షిఫ్ట్ కారుకు ఢీ కొట్టాడు. దీంతో వెంకటేశం తలకు బలమైన రక్త గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రత్యక్ష సాక్షులు అతడి జేబు నుంచి ఫోన్ తీసుకొని అందులో నుంచి కూతురుకు సమాచారం తెలిపారు. వెంటనే కుటుంబ సభ్యులు ఘటన స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. కుమార్తె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పంచాయతీ కార్యదర్శికి అవార్డు


అవార్డును అందుకుంటున్న సంతోష్‌కుమార్

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని గుంజోటి పంచాయతీ కార్యదర్శికి ఉత్తమ సేవా అవార్డు లభించింది. పంచాయతీ కార్యదర్శి సంతోష్‌కుమార్ గురువారం సంగారెడ్డిలో నిర్వహించిన స్వాంతంత్ర్య వేడుకల్లో మంత్రి రాజనర్సింహ, కలెక్టర్ వల్లూరి క్రాంతి చేతుల మీదుగా అవార్డు, ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు.

ఉత్తమ సేవలకు అవార్డులు

ఉమ్మడి మెదక్ జిల్లాలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నంబరాలు అంబరాన్నంటాయి. ఈ సందర్భంగా ఆయా శాఖల్లో ఉత్తమ సేవలు అందించిన అధికారులు, ఉద్యోగులు అవార్డులు, ప్రశంసా పత్రాలను అందుకున్నారు. సిద్దిపేటలో మంత్రి పొన్నం, సంగారెడ్డిలో మంత్రి దామోదర చేతులమీదుగా అందజేశారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి


మంత్రి దామోదర చేతులమీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న ఎస్పీ రూపేశ్

ఎంఈఓకు ప్రశంసా పత్రం..

పటాన్‌చెరు: పటాన్‌చెరు, అమీన్‌పూర్ మండలాల విద్యాధికారి పీపీ రాథోడ్ ఉత్తమ ఎంఈఓగా ప్రశంసా పత్రాన్ని మంత్రి దామోదర రాజనర్సింహ చేతులమీదుగా జిల్లా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశంసా పత్రం పొందడం సంతోషంగా ఉందన్నారు.


మంత్రి దామోదర రాజనర్సింహ చేతుల మీదుగా పత్రం అందుకుంటున్న అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్, అడిషనల్ కలెక్టర్ మాధురి, ట్రైనీ కలెక్టర్ మనోజ్, అడిషనల్ ఎస్పీ సంజీవరావు, అందోల్ ఆర్డీఓ ఆర్ పాండు, నారాయణఖేడ్ ఆర్డీఓ అశోక చక్రవర్తి, జహీరాబాద్ ఆర్డీఓ ఎస్. రాజు, సంగారెడ్డి ఆర్డీఓ వసంత కుమారి, డీఎండబ్ల్యూ దేవుజ, ఎక్సైజ్ అధికారి నవీన్ చంద్ర, సీపీఓ బాలశౌరి, డీఆర్డీఓ జ్యోతి. (కుడి నుంచి ఎడమ).


డీడబ్ల్యూఓ లలితా కుమారి, డీఎంసీఎస్ కొండలరావు, ఎస్ఈ ట్రాన్స్‌కో మాధవరెడ్డి, డీపీఓ సాయిబాబా, కోఆపరేటివ్ ఆఫీసర్ తుమ్మ ప్రసాద్, అడిషనల్ డీఆర్డీఓ బాలరాజ్, ఎల్ఐసీ విద్యాసాగర్, ఏడీ సర్వే ల్యాండ్ ఐనేష్, జెడ్పీ సీఈఓ జానకీరెడ్డి, కలెక్టరేట్ ఏఓ పరమేశం, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు దశరథ్, అందోని గంగాధర్, మనూర్ తహసీల్దార్ వెంకటస్వామి, అందోల్ తహసీల్దార్ భాస్కర్ (కుడి నుంచి ఎడమ).


సంగారెడ్డి తహసీల్దార్ దేవదాస్, కోహిర్ తహసీల్దార్ బాల శంకర్, పటాన్‌చెరు తహసీల్దార్ రంగారావు, రాయికోడ్ తహసీల్దార్ విజయ్ కుమార్, తహసీల్దార్ కలెక్టరేట్ హరి చంద్ర ప్రసాద్ నయాబ్, తహసీల్దార్ గంగాధర్ గిర్దావర్ సదాశివపేట సంతోష్ కుమార్ నయాబ్, సర్వేయర్ కోటేశ్వరరావు, కలెక్టరేట్ ఎస్ఐసీ విజయ్ కుమార్, ఆర్ఐ రాజశేఖర్ రెడ్డి, యాదవ రెడ్డి, జహీరాబాద్ టౌన్ సీఐ శివలింగం, కానిస్టేబుల్ అన్వర్ పాషా, ఏఆర్ పోలీస్ ఎండీ రహమత్, ఏఆర్ పోలీస్ శోభారాణి, భరోసా కోఆర్డినేటర్ దేవలక్ష్మి.


సిద్దిపేటలో.. సీనియర్ అసిస్టెంట్ చక్రవర్తి, ఏఎన్ఎం కవిత, ఆశావర్కర్ అరుణ, ఉమెన్ అండ్ చైల్డ్ శాఖ ఇమ్రాన్‌ఖాన్, మెప్మా కోఆర్డినేటర్ హనుమంతరెడ్డి, ఎస్సీ స్టడీస్ సర్కిల్ డైరెక్టర్ శ్రీకాంత్, ఎంవీఐ శంకర్‌నారాయణ, రవాణా శాఖ పీసీ రవీందర్, రవాణా శాఖ ఏవో నజీర్ (ఎడమ నుంచి కుడికి).


సిద్దిపేటలో.. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో మంత్రి పొన్నం ప్రభాకర్ చేతులమీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్


అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి జయదేవ్‌ఆర్య, అటవీ శాఖ అధికారి శ్రీనివాస్, పశుసంవర్ధక శాఖాధికారి జగత్‌కుమార్‌రెడ్డి, కలెక్టరేట్ ఏఓ అబ్దుల్‌రహెమాన్, హుస్నాబాద్ ఎంఆర్ఓ రవీందర్‌రెడ్డి, డీపీఓ దేవకీదేవి, సిద్దిపేట అర్బన్ ఎంఆర్ఓ సలీం మియా (ఎడమ నుంచి కుడికి)


చిన్నకోడూర్ ఎంఆర్ఓ జయలక్ష్మి, నాయబ్‌ఎంఆర్ఓ ఆశాజ్యోతి, నాయబ్ ఎంఆర్ఓ రాజేశం, నాయబ్ ఎంఆర్ఓ లావణ్య, పౌరసరఫరాలశాఖ అభిలాశ్, సబ్‌ట్రెజరీ ఆఫీసర్ నర్సింహ, హార్టికల్చర్ ఆఫీసర్ హుస్నాబాద్ బాలాజీ, హార్టికల్చర్ ఆఫీసర్ గజ్వేల్ సౌమ్య (ఎడమ నుంచి కుడికి)


సీఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ కిరణ్, సీఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌గౌడ్, ఇన్‌స్పెక్టర్ తోగుట లతీశ్, సీఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, సబ్‌ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రెడ్డి, ఏఆర్ ఎస్ఐ శ్రీనివాస్, సీపీఓ అసిస్టెంట్ సాయిసుమంత్‌రెడ్డి, పీసీ మధుసూదన్(ఎడమ నుంచి కుడికి)



ఎఫ్ఆర్ఓ దుబ్బాక సందీప్‌కుమార్, డిప్యూటీ ఎఫ్ఆర్ఓ చేర్యాల లింగామూర్తి, డిప్యూటీ ఎఫ్ఆర్ఓ శనిగరం గోపాల్‌రెడ్డి, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ములుగు ప్రసాద్, అగ్నిమాపక అధికారి గజ్వేల్ కుమార్, అగ్నిమాపక పీసీ నరేశ్, డీపీఎం కరుణాకర్‌రావు, డీఆర్‌డీఓ సీసీ ప్రతాప్‌కుమార్, వైద్యాశాఖ నర్సింహులు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట

వేర్వేరు చోట్ల ఇద్దరు ఆత్మహత్య

అనారోగ్యంతో ఒకరు.. కడుపునొప్పి భరించలేక మరొకరు..

బెజ్జంకి(సిద్దిపేట): అనారోగ్యంతో మనస్తాపం చెందిన వృద్ధుడు క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మండలంలోని గుగ్గిల్ల గ్రామంలో జరిగింది. ఏఎస్‌ఐ శంకర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గుగ్గిల్ల దుర్గయ్య(70) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. పలుమార్లు కరీంనగరలోని ఆస్పత్రుల్లో వైద్యం చేయించారు. అయినప్పటికీ నయం కాకపోవడంతో మనస్తాపం చెంది ఇంటి వద్దే గురువారం క్రిమి సంహారాక మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే 108లో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ దుర్గయ్య మృతి చెందాడు. మృతుడికి ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. పెద్దకుమారుడు మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

– పటాన్‌చెరు టౌన్: కడుపునొప్పి భరించలేక మహిళా ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన గుమ్మడిదల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ మహేశ్వర్ రెడ్డి కథనం ప్రకారం... బిహార్‌కు చెందిన సికిందర్ కుమార్ రెండు సంవత్సరాల క్రితం బతుకుదెరువు కోసం వచ్చి గుమ్మడిదల పరిధిలోని దోమడుగులో ఉంటూ లేబర్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గత కొంతకాలంగా సికిందర్ భార్య అర్థిదేవి(24) కడుపునొప్పి సమస్యతో బాధపడుతూ మాత్రలు వాడుతోంది. గురువారం ఆమె ఇంట్లో ఉండగా భర్త సిలిండర్ తీసుకు రావడానికి గండిమైసమ్మకు వెళ్లాడు. స్కూల్‌కు వెళ్లిన వీరి కుమారుడు దేవరాజ్ 11:30 గంటలకు వచ్చి చూసేసరికి తల్లి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని కనిపించింది. దీంతో స్థానికులు మృతురాలి సోదరుడు చందన్ కుమార్‌కు సమాచారం ఇవ్వడంతో ఘటన స్థలానికి చేరుకొని కిందికి దింపారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.


అర్థిదేవి (ఫైల్)

వైర్ల విక్రయానికి వచ్చి.. పోలీసులకు చిక్కి..

నలుగురిని అరెస్టు

సిద్దిపేటకమాన్: రాత్రి సమయాల్లో వ్యవసాయ బావుల వద్ద బోరు మోటార్ల వైర్లను దొంగతనం చేస్తున్న నలుగురిని గురువారం సిద్దిపేట టూటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. సిద్దిపేట టూటౌన్ సీఐ ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట రేణుకానగర్‌కు చెందిన పర్వతం పోచయ్య అతడి కుమారుడు పర్వతం రాకేశ్, తమ్ముడు హనుమాన్ నగర్‌కు చెందిన పర్వతం రాజు అలియాస్ రాజయ్య, వీరి స్నేహితుడైన మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలం ఖాజీపూర్‌కు చెందిన కర్రె కుమార్ నలుగురు కలిసి గత సంవత్సరం నుంచి రాత్రి సమయంలో వ్యవసాయ బావుల వద్ద వైర్లు దొంగతనాలకు పాల్పడ్డారు. రామంచ, జక్కాపూర్, మర్కూక్ మండలం నర్సన్నపేట, పెద్దకోడూరు సబ్‌స్టేషన్, ఎల్లుపల్లి, బక్రిచెప్యాల, ఇమాంబాద్ గ్రామాల్లోని వ్యవసాయ బావుల వద్ద మోటార్లు, సర్వీసు వైర్లను దొంగలిస్తున్నారు. వాటిని కాల్చగా వచ్చిన రాగి వైరును గుర్తు తెలియని వ్యక్తులకు అమ్ముకుంటూ వచ్చిన డబ్బులతో ఖర్చు పెట్టుకునేవారు. కాగా, దొంగిలించి రాజీవ్ రహదారి పక్కన ఎల్లమ్మగుడి, నర్సాపూర్ సమీపంలో చెట్ల పొదల్లో దాచిన వైరును విక్రయించడానికి ప్రయత్నిస్తుండగా పెట్రోలింగ్ పోలీసు సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి ఆరు నెలల క్రితం పర్వతం పోచయ్య కరీంనగర్ బస్టాండ్ సమీపంలోని వైన్ షాప్ వద్ద దొంగిలించిన టీవీఎస్ ఎక్స్‌ఎల్ వాహనం, 250 మీటర్ల సర్వీసు వైరు, దొంగతనం చేయడానికి ఉపయోగించిన టార్చ్‌లైట్, కట్టరులను స్వాధీనం చేసుకున్నారు. వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.


నిందితులను చూపుతున్న సీఐ ఉపేందర్, సిబ్బంది

వ్యక్తి అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: ఇంటి నుంచి చెప్పకుండా బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన బీమ్ సింగ్ ఈనెల 10న బతుకుతెరువు కోసం వచ్చి అమీన్‌పూర్ పరిధిలోని సూర్య గ్లోబల్ స్కూల్ సమీపంలో గుడిసెలో ఉంటూ, లేబర్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 13న పనికి వెళ్లి తిరిగి సాయంత్రం నివాసం ఉంటున్న చోటుకు వచ్చి ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లి ఎంతకీ రాలేదు. అల్లుడు హరిలాల్ మామ అదృశ్యంపై ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసును పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి


గణేశ్ (ఫైల్)

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని కొర్విపల్లి వద్ద రెండు బైక్‌లు ఢీకొన్న సంఘటనలో తీవ్రంగా గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈనెల 12న మెదక్ నుంచి మాసాయిపేటకు బైక్‌పై గుట్టకింది పల్లికి చెందిన చాకలి గణేశ్(23) వస్తున్నాడు. కొర్విపల్లి వద్ద ఇతను ప్రయాణిస్తున్న బైక్, ఇంకొక ద్విచక్ర వాహనం రెండూ ఢీకొన్నాయి. దీంతో తీవ్రగాయాలకు గురైన అతడిని మెదక్ ఏరియా హాస్పిటల్ తరలించారు. మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఇక్కడ చికిత్స పొందుతూ గురువారం గణేశ్ మృతిచెందాడు. అతని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గాయపడిన వివాహిత..

సిద్దిపేటకమాన్: కుటుంబ కలహాలతో భర్త చేతిలో గాయపడిన భార్య ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందింది. వివరాల ప్రకారం.. పట్టణంలోని ఇందిరమ్మకాలనీలో నీలం సరిత రాజు దంపతులు నివాసం ఉంటున్నారు. ఈనెల 10న కుటుంబ కలహాలతో నేపథ్యంలో భార్య ముఖంపై భర్త గ్రానైట్ రాయితో దాడి చేసి గాయపర్చాడు. కాగా పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళ గురువారం మృతి చెందింది. వన్ టౌన్ పోలీసులకు అందిన ఫిర్యాదు మేరకు నిందితుడిని ఆదివారమే అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడం తెలిసిందే.

జనగామ వద్ద నిందితుడి అరెస్టు

పరారీలో మరో ఇద్దరు : సీఐ శ్రీనివాస్

అక్కన్నపేట(హుస్నాబాద్): భూ తగాదాలో సొంత అన్నను హతమార్చిన హత్య ఘటనలో ఒకరిని గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అక్కన్నపేట పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో గురువారం హుస్నాబాద్ సీఐ శ్రీనివాస్ వివరాలను వెల్లడించారు. ఈ నెల 12న అక్కన్నపేట మండలం మసిరెడ్డితండా గ్రామంలో భూ తగాదాల విషయంలో సొంత అన్న గుగులోతు రాజు (43)ను పథకం ప్రకారం మరదలు లలీత, తమ్ముడు భీమా, అతని కుమారుడు అనిల్ కలిసి కర్రలు, పైపులతో కొట్టి చంపేశారన్నారు. దీంతో జనగామ గ్రామ క్రాసింగ్ వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ నిర్వహిస్తుండగా నిందితుడు భీమాను అదుపులో తీసుకొని రిమాండ్‌కు తరలిస్తున్నామన్నారు. అలాగే అతడి బైక్‌ను స్వాధీనం చేసుకొని సీజ్ చేశామన్నారు. మిగతా నిందితులు లలీత, అనిల్ పరారీలో ఉన్నారని, వారిని కూడా త్వరలో పట్టుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎస్సై విజయ్‌భాస్కర్, హెడ్‌కానిస్టేబుల్స్ రమేశ్, కృష్ణతో పాటు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


నిందితుడిని చూపిస్తూ సమావేశంలో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్

మలుపు వద్ద కబళించిన మృత్యువు

- బైక్‌ను ఢీకొన్న బస్సు ఒకరి మృతి
- ఇద్దరికి తీవ్ర గాయాలు

నారాయణఖేడ్: బైక్‌ను బస్సు ఢీకొన్న ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన నిజాంపేట్ మండలం మేఘ్యానాయక్ తండా దర్గా సమీపంలో 161బీ జాతీయ రహదారిపై గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. షోలాపూర్‌కు చెందిన నీలకంఠి విలాస్ (35) పెద్దశంకరంపేటకు చెందిన స్రవంతిని పదేళ్ల క్రితం వివాహం చేసుకొని పెద్దశంకరంపేటలో మొబైల్ షాపు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం నారాయణఖేడ్ నుంచి పెద్దశంకరంపేటకు మెదక్ మండలం కొత్తపేట్‌కు చెందిన ప్రవీణ్ (36), సురేశ్ (35)లతో కలిసి అతను బైక్‌పై వెళ్తున్నాడు. నిజాంపేట్ వైపు నుంచి నారాయణఖేడ్‌కు వస్తున్న యాదగిరిగుట్ట డిపోకు చెందిన బస్సు మలుపు వద్ద వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విలాస్ అక్కడిక్కడే మరణించాడు. మిగతా ఇద్దరికి తీవ్ర గాయాలపాలయ్యారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు వీరిని ఖేడ్ ప్రభుత్వాస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం సంగారెడ్డి ఆస్పత్రికి తరలించారు. ఇందులో ప్రవీణ్ పరిస్థితి విషమంగా ఉందని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. విలాస్‌కు భార్య స్రవంతి, కుమారుడు, కుమార్తె ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు.


విలాస్ (ఫైల్)

15 సార్లు వరించిన అవార్డులు

మరోసారి ఉత్తమ జిల్లా అధికారిగా జగత్‌కుమార్‌రెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఉత్తమ జిల్లా అధికారిగా జిల్లా పశుగణాభివృద్ధి, పశుసంవర్థకశాఖ జాయింట్ డైరెక్టర్ జగత్‌కుమార్‌రెడ్డి అందుకున్నారు. 78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా, గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించిన వేడుకల్లో ఈ అవార్డును అందుకున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ మనుచౌదరి, సీపీ అనురాధ ఉత్తమ జిల్లా అధికారిగా జగత్‌కుమార్‌రెడ్డికి అవార్డును, ప్రశాంస పత్రాన్ని అందించారు.

- ఇప్పటి వరకు 3 రాష్ట్ర స్థాయి, 12 జిల్లా స్థాయి ఉత్తమ అధికారిగా అవార్డులను జేడీ జగత్‌కుమార్‌రెడ్డి పొందారు. సెల్ఫ్‌హెల్ప్ గ్రూప్‌లో ఉత్తమ ఫలితాలు సాధించినందుకు గాను నాబార్డ్ చీఫ్ జనరల్ మేనేజర్‌తో 2003లో రాష్ట్ర స్థాయి అవార్డు పొందారు. 2003లో సెల్ఫ్‌హెల్ప్ గ్రూప్‌లను బ్యాంక్‌లతో లింక్ చేసినందుకు గాను నాటి రాష్ట్రపతి అబ్దుల్ కలాం, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో రాష్ట్ర స్థాయి అవార్డు పొందారు. 2017లో ఎస్‌బీఎం విభాగంలో నాటి తెలంగాణ రాష్ట్ర చీఫ్ సెక్రటరీ నుంచి రాష్ట్ర స్థాయి అవార్డును అందుకున్నారు. దీంతో పాటుగా జిల్లా స్థాయిలో 12 అవార్డులను అందుకున్నారు. కాగా, రాష్ట్ర స్థాయిలో, జిల్లా స్థాయిలో ఏ శాఖలో విధులు అప్పగించిన వాటిని సక్రమంగా నిర్వహించడంలో జగత్‌కుమార్‌రెడ్డిది పెట్టింది పేరు. ముఖ్యంగా డీఆర్‌డీఓ, రూరల్ డెలప్‌మెంట్, సెల్ఫ్‌హెల్ప్ గ్రూప్, పశుసంవర్థకశాఖ, బీసీ సంక్షేమశాఖ ఇలా ఏ శాఖలో విధులు నిర్వహించిన అన్నింటిలో తనదైన ముద్ర వేశారు. జాయింట్ డైరెక్టర్ జగత్‌కుమార్‌రెడ్డి మరో రెండు నెలల్లో పదవీ విరమణ చేయనున్నారు.


జిల్లా ఉత్తమ అధికారిగా అవార్డును అందుకుంటున్న జేడీ జగత్‌కుమార్‌రెడ్డి